సాక్షి
జగిత్యాల
మంగళవారం | 7 | ఫిబ్రవరి | 2023



సంక్షేమానికి జై

ఉమ్మడి జిల్లాలో 13,200 మందికి దళితబంధు

కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కు రూ.750 కోట్లు	కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.186 కోట్లు
నీటిపారుదల రంగానికి రూ.569 కోట్లకు పైగా ఫండ్స్	వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.50 కోట్లు

ఆర్ఎఫ్‌సీఎల్‌కు రాష్ట్ర ఈక్విటీ కింద రూ.10 కోట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2023–24లో ఉమ్మడి జిల్లాలో సంక్షేమానికి పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో కొత్త పథకాలు ఏమీ లేకపోయినా.. ఇప్పటికే కొనసాగుతున్న పలు పథకాలకు నిధులు దండిగా కేటాయించారు. వ్యవసాయం, సామాజిక సంక్షేమం, సామాజిక భద్రత, నీటిపారుదల, మున్సిపల్, పర్యాటక, ఆధ్యాత్మిక, విద్య, క్రీడా రంగాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా నిధులు విడుదల చేశారు. ఈ కేటాయింపుల్లో కొన్నింట్లో పెరుగుదల కనిపించగా.. మరికొన్నింట్లో తగ్గుదల నమోదైంది. నీటిపారుదల, శాంతిభద్రతలు, సంక్షేమానికి నిధుల్లో ప్రాధాన్యం కనిపించింది. ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మీ/షాదీ ముబారక్ వంటి పథకాలకు ఎప్పటిలాగే పెద్దపీట వేయగా.. ఎన్నికల సంవత్సరం కావడంతో రైతుల కోసం నీటిపారుదల రంగానికి నిధులు పెంచారు. అలాగే.. దళితబంధుకు సైతం నిధుల్లో మంచి భాగస్వామ్యాన్నే కల్పించారు. పురపాలికలకు ఆర్థిక సాయం, స్మార్ట్‌సిటీలకు నిధుల్లోనూ పెద్దపీటే వేశారు. సొంతింటికి రూ.3 లక్షల ఆర్థిక సాయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గానికి 1,100 మందికి..



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకం దళితబంధు. ప్రతీ దళితులను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చాలన్న ఉద్దేశంతో హుజూరాబాద్‌లో విజయవంతంగా అమలు చేశారు. ఉమ్మడి జిల్లాలో మిగిలినవి 12 నియోజకవర్గాలు. గతంలోలాగా నియోజకవర్గానికి 100 మందికి పరిమితం కాకుండా ఈసారి 1100 మంది చొప్పున ప్రభుత్వం సాయం ప్రకటించనుంది. ఈ లెక్కన 13,200 మందికి పథకాన్ని ఇవ్వనున్నారు. వీరికి ప్రతీ ఒక్కరికి రూ.10 లక్షల చొప్పున దాదాపు రూ.1,320 కోట్ల ఆర్థికసాయం అందించనున్నారు. ఈ పథకం అమలు కోసం గతేడాది దాదాపు రూ.1,800 కోట్లకుపైగా ఒక్క హుజూరాబాద్‌లోనే ప్రభుత్వం యూనిట్ల మంజూరుకు వెచ్చించింది.

సొంతింటికి రూ.3 లక్షలు..



డబుల్ బెడ్‌రూములు ఇప్పటికే జిల్లాల్లో వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభానికి దగ్గరగా ఉన్నాయి. అదే క్రమంలో గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థలం ఉన్న ప్రతీ అర్హులకు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయం చేస్తామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో స్థలం ఉండి.. ఇల్లు కట్టుకోలేని వారికి ఇది శుభవార్తే. కానీ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగిన నేపథ్యంలో రూ.3 లక్షలు ప్రకటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే ధరపై ప్రభుత్వమే సబ్సిడీపై ఇంటి సామగ్రిని సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

పురపాలికలకు కేటాయింపులు ఇలా..



ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఆర్థిక సాయం కింద రూ.20 కోట్లు ప్రకటించింది. అయితే.. గతేడాది బడ్జెట్‌లో ఈ సాయం రూ.30 కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది పద్దులో మాత్రం రూ.10 కోట్లు తక్కువగా కేటాయించారు.

కరీంనగర్ స్మార్ట్‌సిటీకి రూ.186.56 కోట్లు



కరీంనగర్ స్మార్ట్‌సిటీకి ప్రభుత్వం తన వంతు వాటాగా.. ఈ ఏడాది రూ.186.56 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలోని స్మార్ట్‌సిటీలకు మొత్తంగా రూ.373.14 కోట్లు కేటాయించగా.. సగం వరకు కరీంనగర్‌కు కేటాయించడం విశేషం. ఇప్పటికే స్మార్ట్‌సిటీ కింద కేంద్రం నుంచి వచ్చిన నిధులతో జంక్షన్ల సుందరీకరణ, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు తదితర పనులు వేగంగా సాగుతున్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో పనులు మరింత వేగం పుంజుకోనున్నాయని మేయర్ సునీల్ రావు తెలిపారు. కేంద్ర రాష్ట్రం 50:50 ప్రాతిపదికన జరుగుతున్న పనుల్లో ఇంతవరకూ రూ.196 కోట్లు తెలంగాణ, మరో రూ.196 కోట్లు కేంద్రం నిధులు ఇచ్చాయి.

నిధులు	కేటాయింపు
కరీంనగర్ స్మార్ట్‌సిటీ	రూ.166.25 కోట్లు
ఎస్సీ, ఎస్టీ కింద	రూ.12.88 కోట్లు
టీఎస్పీ నిధుల కింద	రూ.7.43 కోట్లు
మొత్తంగా స్మార్ట్‌సిటీకి..	రూ.186.56 కోట్లు

క్రీడా స్కూల్ కోసం రూ.8 కోట్లకుపైగా..



ఉమ్మడి జిల్లా ఉజ్వలపార్క్ సమీపంలో ఎల్ఎండీ స్పోర్ట్స్ స్కూల్ కోసం ఈ ఏడాది రూ.16.53 కోట్లు కేటాయించారు. ఈ నిధులను టీఎస్ స్పోర్ట్స్ స్కూల్‌తో కలిసి పంచుకోవాల్సి ఉంటుంది. ఈ లెక్కన రూ.8.2 కోట్ల వరకు నిధులు రానున్నాయి. ఈ నిధులతో స్విమ్మింగ్‌పూల్, జిమ్నాజియం, బాక్సింగ్ ఇండోర్ హాల్, జుడో, రెజ్లింగ్ ప్రత్యేక హాలు, సింథటిక్ ట్రాక్ (మల్టీ పర్పస్ ట్రాక్), కోచ్‌లు, సదుపాయాల ఆధునికీకరణ, హకీంపేట తరహాలో క్రీడాకారులకు డైట్ తరహా సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఈ రెండు టీఎస్ స్పోర్ట్స్ స్కూళ్లకు కలిపి గతేడాది రూ.19.70 కోట్లు కేటాయించింది.

- ఇక రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాలకు రూ.500 కోట్లు కేటాయించింది. ఇందులో ఉమ్మడి జిల్లాలో ఉన్న శాతవాహన వర్సిటీకి ఎన్నినిధులు వస్తాయన్న దానిపై స్పష్టత లేదు.

పర్యాటకానికి ఊతం..



- కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్ కింద రూ.750 కోట్లు కేటాయించింది. కాళేశ్వరం దాని అనుబంధంగా ఉన్న పలు ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ల పరిసరాల్లో పర్యాటకం అభివృద్ధికి ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా గోదావరిఖనిలో బోటింగ్, కనోయింగ్, కయాకింగ్ తదితర క్రీడల అభివృద్ధికి దోహదపడతాయి. ఇక లోయర్‌మానేరు, మిడ్‌మానేరు, అప్పర్ మానేరు రిజర్వాయర్ల పరిసరాల సుందరీకరణ, పర్యాటకులను ఆకట్టుకునేందుకు బోటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసుకునే వీలుంది. ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో కోటిలింగాల రేవు వద్ద గోదావరిలో పడవ ప్రయాణం పునఃప్రారంభించేందుకు వీలు చిక్కనుంది.

వేములవాడ ఆలయం అభివృద్ధికి రూ.50 కోట్లు



యాదాద్రి తరహాలో వేములవాడను ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని సీఎం గతంలోనే ప్రకటించారు. ఈ మేరకు వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ)ను ఏర్పాటు చేసింది. గతంలో రూ.50 కోట్లు ప్రభుత్వం ఇచ్చింది. ఆ నిధులను భూసేకరణకు, జీతభత్యాలకే వినియోగించారు. టెంపుల్ కోసం పలు ఆనంద్‌సాయి, స్థపతి వల్లినాయగం నేతృత్వంలో పలుమార్లు గుడికి వచ్చి.. కొన్ని డిజైన్లు పరిశీలించినా.. ఏదీ ఖరారు చేయలేదు. తాజాగా రూ.50 కోట్లు కేటాయించడంతో దక్షిణకాశీ అభివృద్ధిపై తిరిగి ఆశలు చిగురించాయి.

- చేనేత బీమాకు ఈ బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించింది. ఆకస్మికంగా చేనేత కార్మికులు మరణిస్తే.. వారి కుటుంబాలకు పదిరోజుల్లోగా రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తానని ప్రకటించింది.

ఆర్ఎఫ్‌సీఎల్‌కు రూ.10 కోట్లు..

- రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)కు రాష్ట్రం రూ.10 కోట్లు కేటాయించింది. స్టేట్ ఈక్విటీ కింద తన వంతుగా ఈ నిధులు కేటాయించింది.

నీటి ప్రాజెక్టులకు..
రూ.569 కోట్లకుపైగా..!

గతేడాదితో పోలిస్తే.. ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల్లో పెరుగుదల నమోదైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు చిన్న, మధ్య, తరహా ప్రాజెక్టుల నిర్వహణకు గతేడాది రూ.451 కోట్లు విడుదల చేయగా.. ఈ ఏడాది ఆ నిధులు రూ.569.79 కోట్లకు చేరుకుంది.



ప్రాజెక్టు/ఆఫీస్	ఈ ఏడాది	గతేడాది
శ్రీపాదఎల్లంపల్లి	రూ.349.43 కోట్లు	రూ.273.02 కోట్లు
బొగ్గులవాగు(సీఈ)	రూ.32.00 లక్షలు	రూ.65 లక్షలు
మానేరు ప్రాజెక్టు	------	------
శనిగరం (సీఈ)	రూ.65 లక్షలు	-----
వరద కాలువకు	రూ.219.39 కోట్లు	రూ.177.15 కోట్లు
రామడుగు (గోదావరి బేసిన్)	రూ.2.18 కోట్లు	----

జాడలేనివి ఇవే..!

- గతేడాది డిసెంబరు7వ తేదీన జగిత్యాలకు సీఎం కొండగట్టుకు రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించారు. వాస్తవానికి దేవాలయాభివృద్ధికి ప్రభుత్వం దాదాపు 380 ఎకరాలు కేటాయించింది. ఈ బడ్జెట్‌లో రూ.100 కోట్లు ప్రకటిస్తారని ఆశించినా.. దీనిపై స్పష్టత రాకపోవడం భక్తులను నిరాశపరిచింది. అలాగే ధర్మపురి ఆలయాభివృద్ధిపైనా స్పష్టత రాలేదు.
- బసంత్‌నగర్ విమానాశ్రయంపై మొన్న కేంద్ర బడ్జెట్‌లోనూ, తాజాగా రాష్ట్ర బడ్జెట్‌లోనూ ఎలాంటి ప్రకటన రాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

రైతులకు వరాలు



కేంద్ర బడ్జెట్‌తో పోల్చితే రాష్ట్ర బడ్జెట్‌లో రైతులకు వరాలు కురిపించారు. వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించడం అభినందనీయం. గతంలో కొద్దిమందికే రుణాలు మాఫీ చేశారు. ఇప్పుడు, అత్యధికంగా నిధులు కేటాయించడంతో అందరు రైతులకు పంట రుణాలు మాఫీ అయ్యే అవకాశం ఉంది.

– దావ వసంత, జెడ్పీ చైర్‌పర్సన్

పేదలకు పెద్దపీట



రాష్ట్ర బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించేందుకు రూ.వెయ్యి కోట్లు కేటాయించడంతో సాగువిస్తీర్ణం పెరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, శిశు సంక్షేమం, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించడం అభినందనీయం.

– నక్కల రాధ, మార్కెట్ చైర్‌పర్సన్

అన్నివర్గాలకు అనుకూలం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల సంక్షేమాన్ని ఆశించిన దిశలో ఉంది. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేసే పథకం ఆశించదగినది. మంత్రి హరీశ్ రావు, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు.

– కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

గల్ఫ్ బాధితులకు నిరాశ



జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీని తెరిపించేందుకు నిధులు కేటాయించకుండా రైతులను నిరాశకు గురిచేశారు. కేవలం రూ.వెయ్యి కోట్లతో ముత్యంపేట, బోధన్, ముంబోజిపల్లి షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి వరికి ప్రత్యామ్నాయంగా చెరుకు పండించే అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. గల్ఫ్ వలస జీవుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోకపోవడం విచారకరం.

– జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఇది ఎన్నికల బడ్జెట్



వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పద్దులు, అంకెల లెక్కలు చూపుతూ బడ్జెట్‌లో గారడి చేశారు. ఇది ఏమాత్రం పేదలకు, దళితులకు, వెనుకబడిన వర్గాలకు అనుకూలంగా లేదు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్‌గా భావిస్తున్నాం.

– మోరపల్లి సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రైతు సంక్షేమానికి పెద్దపీట



బడ్జెట్‌లో రైతు సంక్షేమానికి మరోమారు పెద్దపీట వేసింది. వ్యవసాయ, సాగునీటి రంగాలకు అధిక నిధులు కేటాయించడం ఇందుకు నిదర్శనం. బడ్జెట్ ఫలాలతో వలసలు తగ్గి వ్యవసాయంపై ప్రజలు ఎక్కువగా దృష్టి పెడుతారు.

– లోక బాపురెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్

న్యూస్‌రీల్

ప్రజావాణికి 33 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాలటౌన్: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 33 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ యాస్మిన్ బాషా.. బాధితులతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణి ద్వారా అందిన సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు బీఎస్ లత, మకరంద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల బడ్జెట్



బడ్జెట్ పత్రాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలటౌన్: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు ఎంతో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం ఆయన ఫోన్ ద్వారా తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్థికమంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ సంతృప్తిగా ఉందని అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు భారీగా నిధులు కేటాయించారని ఆయన ప్రశంసించారు.

ఫిర్యాదుదారుకు ప్రాధాన్యం



పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌కు వచ్చే వారికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత తాణా పరిసరాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. నేరాలు, వాటి తీరుపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఉమాసాగర్, ఏఎస్ఐ రాములు, సిబ్బంది ఉన్నారు.

అర్హులకే కేటాయించాలి



మాట్లాడుతున్న తిరుపతినాయక్

జగిత్యాలటౌన్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లు పేదలను నిరాశకు గురిచేశాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇందూరి సులోచన, సారంగపాణి, ముదు గంరాజలింగం తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదికి తాళం



తరగతి గదికి తాళం వేస్తున్న గొర్రె తిరుపతి

కొడిమ్యాల(చొప్పదండి): మన ఊరు .. మన బడి కింద చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతూ రామకృష్ణాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తరగతి గదికి విద్యా కమిటీ చైర్మన్ గొర్రె తిరుపతి సోమవారం తాళం వేశాడు. రూ.ఐదు లక్షలు వెచ్చించి పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాల భవనానికి మరమ్మతు, సంపు నిర్మాణం, కిటికీలకు తలుపుల బిగింపు పూర్తిచేశామని తెలిపారు. తక్షణమే తనకు బిల్లులు చెల్లించాలని ఆయన కోరాడు.

'మనదర్శిని'పై అవగాహన



విద్యార్థులతో అధికారులు

ధర్మపురి: నేరెళ్ల అటవీప్రాంతంలో సోమవారం అడవుల(మన దర్శిని)పై అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వాలకు ప్రజలే గుణపాఠం చెప్పాలి





ధర్మపురిలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాలలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రను సోమవారం పట్టణంలో ప్రారంభించారు. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం మత ద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. ధర్మపురి పుణ్యక్షేత్రం అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.500 కోట్లు మంజూరు చేస్తానని చెప్పి.. విస్మరించారని విమర్శించారు. ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతున్న కొప్పుల ఈశ్వర్ ధర్మపురి అభివృద్ధికి చేసిందేమీలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దినేశ్, ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, నాయకులు చిలుముల లక్ష్మణ్, బాలాగౌడ్, కౌన్సిలర్లు పద్మ, సంతోషి పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

జగిత్యాలటౌన్: లాభాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు కేంద్రప్రభుత్వం కుట్ర చేస్తోందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి ఆరోపించారు. స్థానిక ఇందిరాభవన్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు జరిగిన ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశ సంపదను అదానికి దోచిపెట్టేందుకే లాభాల్లో ఉన్న ఎల్ఐసీని విక్రయించేందుకు యత్నిస్తున్నారన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బండ శంకర్, బల్దియా ఫ్లోర్‌లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, కౌన్సిలర్ నక్క జీవన్, మైనార్టీ సెల్ కార్యదర్శి మొయిజొద్దీన్, నాయకులు దేవేందర్‌రెడ్డి, పుప్పాల అశోక్, పులి రాము, గుండ మధు, మన్సూర్, నేహాల్, రజినీకాంత్ పాల్గొన్నారు.



వైభవంగా ముత్యాల పోచమ్మ రథోత్సవం

బుగ్గారం(ధర్మపురి): మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ, నల్లపోచమ్మ జాతరలు సోమవారం వైభవంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు బోనాలతో నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వేళ అమ్మవారిని రథంపై ఆశీనునలను చేసి శోభాయాత్ర నిర్వహించారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం ఆద్యంతం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎంపీపీ రాజమణి, బుగ్గారం గ్రామ సర్పంచ్ మూల సుమలత, వైస్ ఎంపీపీ సుచేందర్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంసీసీ అధ్యక్షుడు వేముల సుభాష్, నాయకులు అబ్దుల్ రహమాన్, మూల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎన్పీడీసీఎల్ ఎస్ఈ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈ

జగిత్యాలజోన్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన షేక్ యాస్మిన్ భాషను సోమవారం ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామని, అందుకు అవసరమైన స్థలాన్ని మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఎస్ఈ వెంట విద్యుత్ శాఖ అధికారులు శివరాం, రాజిరెడ్డి, రవీందర్, నగేశ్‌కుమార్‌లున్నారు.

బీజేపీ విస్తరణకు నడుం బిగించాలి


మాట్లాడుతున్న మర్రిపెల్లి సత్యం

ధర్మపురి: భారతీయ జనతా పార్టీ విస్తరణ కోసం నడుం బిగించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం అన్నారు. సోమవారం ధర్మపురిలో ఏర్పాటు చేసిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆదివారం నాందేడ్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడిన మాటలన్నీ అబద్ధాలేనని అన్నారు. రాష్ట్రానికి 24 గంటల కరెంటు ఇస్తున్నామని, కాళేశ్వరం ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీరిస్తున్నట్లు మాట్లాడటం బాధాకరంగా ఉందని ఎద్దేవ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బెజ్జారపు లవన్‌కుమార్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నాయకులు బండారి లక్ష్మణ్, కస్తూరి శరత్, దివిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'రుణాలు ఇచ్చేది లేదనడం సరికాదు'

ధర్మపురి: ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే రాష్ట్రాలకు అదనపు రుణాలు ఇచ్చేది లేదని కేంద్రం ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడం సరికాదని కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల డబ్బులతో అదాని లాంటి వారి షేర్లలో పెట్టుబడులు పెట్టి వారు బిలియనీర్లు అవుతున్నారని, సీపీఎస్ ఉద్యోగులు జూదంలో ఓడుతున్నారని మండిపడ్డారు. కేంద్రం అవలంబిస్తున్న తీరును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వెల్గటూర్ మండలంలోకి బీర్‌సాని

వెల్గటూర్(ధర్మపురి): బుగ్గారం మండలంలోని బీర్‌సాని గ్రామాన్ని వెల్గటూర్ మండలంలో చేర్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు బీర్‌సాని గ్రామాన్ని వెల్గటూర్ మండలంలో కలపడంతో హర్షం వ్యక్తమవుతోంది.

కొత్త పంట.. ఆదాయమే ఇంట

- 'బ్రోకోలి' సాగుచేస్తున్న చల్‌గల్ రైతు
- నేరుగా జగిత్యాల మార్కెట్లో అమ్మకం
- కాలీఫ్లవర్ కంటే రెండింతల ధర
- లాభదాయకమంటున్న గంగారెడ్డి

జగిత్యాలఅగ్రికల్చర్: ఆ యువ రైతు ఏడాది పొడవునా కూరగాయలు సాగు చేస్తుంటాడు. మార్కెట్లో ధర ఉన్నా లేకున్నా ఎకరం నుంచి రెండు ఎకరాల్లో కూరగాయలు సాగు చేయడం ఆయన నైజం. పండిన పంటను హోల్‌సేల్‌గా వ్యాపారులకు విక్రయిస్తాడు లేదంటే నేరుగా మార్కెట్లో కూర్చుండి విక్రయిస్తుంటారు. ఇప్పుడు కొత్త కూరగాయల పంట అయిన «బ్రోకోలి» సాగు చేస్తూ.. జగిత్యాల మార్కెట్‌లో విక్రయాలు సాగిస్తున్నాడు. ఆ రైతే జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన ఆకుల గంగారెడ్డి.


బ్రోకోలి పంట పూలతో రైతు గంగారెడ్డి

బ్రోకోలికి మార్కెట్‌లో మంచి డిమాండ్

బ్రోకోలి క్యాబేజీ జాతికి చెందిన మొక్క. ఇది కాలీఫ్లవర్ మాదిరిగా ఆకుపచ్చ రంగు కలిగి పువ్వు రూపంలో ఉండటంతో కూరగాయలుగా వాడుతుంటారు. ఆరోగ్యానికి అవసరమైన వివిధ రకాల పోషకాలు, ఖనిజాలు, విటమిన్లను అందిస్తుండటంతో బ్రోకోలీకి మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. ఈ పువ్వుల్లో అధిక మొత్తంలో ఫైబర్ ఉండటంతో మనిషి జీర్ణక్రియకు దోహదం చేస్తూ కడుపు లోపలి పొరలు, ఆరోగ్యంగా ఉత్తేజంగా ఉండేలా చేస్తుంది. 400 గ్రాముల బరువు గల ఒక్కో పువ్వు రూ.40 వరకు ధర ఉంది. కిలో రూ.80–100 వరకు ధర పలుకుతోంది. కాలీఫ్లవర్ రేటుతో పోల్చితే రెండింతల రేటు. కాలీఫ్లవర్ పువ్వును మాత్రమే కూరగాయలుగా వాడుతుండగా బ్రోకోలిలో పువ్వుతో పాటు కాండంను కూడా ఉపయోగించే అవకాశం ఉంది.

హైదరాబాద్ నుంచి బ్రోకోలి మొక్కలు

ఏటా సాధారణ కూరగాయలను సాగు చేసినప్పటికీ పెద్దగా ధర గిట్టుబాటు కావడం లేదు. దీంతో గంగారెడ్డి చూపు బ్రోకోలి పంట వైపు మళ్లింది. ఏ పంకైనా ఒకే రకంగా కష్టపడటమే. అదే అధిక ధర పలికే బ్రోకోలి సాగు చేస్తే మార్కెట్లో అధిక ధర వస్తుందని తెలుసుకున్నాడు. తర్వాత పంట సాగు గురించి ఆయా ప్రాంతాల రైతులతో చర్చించారు. హైదరాబాద్ కూరగాయల నర్సరీ నుంచి ఒక్కో మొక్కకు రూ.2 చెల్లించి 1,000 మొక్కలు తీసుకవచ్చాడు. కొత్త పంట కాబట్టి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తే పంట వచ్చిన తర్వాత ఎలా ఉంటుందోనని ఉద్దేశ్యంతో కేవలం 5 గుంటల్లో మాత్రమే సాగు చేసారు. అప్పటికే బ్రోకోలి సాగు చేసే భూమిని రెండు సార్లు బాగా దున్ని ఆఖరు దుక్కిలో డీఏపీ వేసాడు. మడులుగా సాగు భూమిని తయారు చేసి నీటిని పారించాడు. తేమ ఉన్న భూమిలో మొక్కలను నాటాడు. మొక్కలు ఏనుకునే వరకు మూడు రోజులకొకసారి సాగు నీటిని ఇచ్చి తర్వాత వారం రోజులకొకసారి సాగు నీటిని అందించాడు.

సంక్రాంతి వరకు మార్కెట్లోకి..

సంక్రాంతి తర్వాత పంట మార్కెట్లోకి వచ్చేలా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఇందుకోసం నవంబర్ 4న మొక్కలు నాటారు. కలుపు సమస్య లేకుండా ఎప్పటికప్పుడు గడ్డిని తీసి రెండుసార్లు యూరియాను పై పాటుగా మొక్కలకు అందించారు. దాదాపు 3 నెలల పంట కావడం, కొత్తగా సాగు చేస్తుండటంతో అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటించడంతో పెద్దగా తెగుళ్లు, పురుగులు ఆశించలేదు. కనీసం ఒక్కసారైనా క్రిమిసంహారక మందు పిచికారి చేయకపోవడం గమనార్హం. దీంతో నాలుగైదు గుంటల భూమిలోనే దాదాపు 3 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది.

నేరుగా వినియోగదారులకు విక్రయం

పంట చేతికి వచ్చే ముందు జగిత్యాల మార్కెట్లో వ్యాపారులను సంప్రదించాడు. కాని, కొత్త పంట ఇక్కడి వినియోగదారులకు ఎక్కువగా తెలియకపోవడంతో పాటు ఒక్కో పువ్వు రూ.40–50 వరకు ఉండటంతో కొనకపోతే నష్టం వస్తుందని వ్యాపారులు భావించారు. తొలుత వినియోగదారులకు పరిచయం చేసేందుకు రైతు గంగారెడ్డి ప్రతిరోజూ 20–25 పువ్వులను తోట నుంచి తెంపుకుని నేరుగా జగిత్యాల మార్కెట్లో వినియోగదారులకు విక్రయిస్తున్నారు. 10 రోజులుగా విక్రయిస్తుండటంతో వినియోగదారులకు బ్రోకోలి పరిచయం అయ్యింది. దీంతో వినియోగదారులు సైతం కొత్త కూరగాయ పంట రుచి చూద్దామని కొనుగోలు చేస్తుండటంతో వస్తోండటంతో రైతు గంగారెడ్డి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'

జగిత్యాలటౌన్: అక్రమ అరెస్టులతో అంగన్‌వాడీల ఉద్యమాన్ని ఆపలేరని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారందరికీ ఆహారం అందించడంతో పాటు అనేక సేవలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హైదరాబాద్‌లో తమ నిరసన వ్యక్తం చేసేందుకు వెళ్లగా మహిళలని కూడా చూడకుండా పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. రాష్ట్రంలోని 70 వేల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్రమంతా తమ కుటుంబమేనన్న మంత్రి కేటీఆర్ కుటుంబసభ్యులమైన తమను ఎందుకు అరెస్టు చేయిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని పేర్కొన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాలరూరల్: మండలంలోని టీఆర్‌నగర్‌లో షేక్ కరీం, షేక్ బాబాఖాన్‌లపై కత్తితో దాడి చేసిన అబ్దుల్ రహీంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు. షేక్ అస్మా–అబ్దుల్ రహీం భార్యభర్తలు గొడవ పడుతుండగా షేక్ అస్మా సోదరులు షేక్ కరీం, షేక్ బాబాఖాన్‌లు అడ్డుకోబోయారు. దీంతో వారిద్దరిపై రహీం కత్తితో దాడి చేసి గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గొడవ చేసిన వ్యక్తిపై..

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన బాదినేని గంగన్న ఇంటికి వెళ్లి అకారణంగా గొడవ చేసిన రామగిరి బీమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. గంగన్న తన ఇంటి వద్ద ఎలాంటి కారణాలు లేకుండా గొడవ చేసినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళా సంఘాల ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాలటౌన్: మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులను ప్రోత్సహించి, ఉపాధి అవకాశాలు మెరుగు పర్చాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సూచించారు. పట్టణంలోని టౌన్‌హాల్‌లో సోమవారం నాబార్డు ఆధ్వర్యంలో «సాధికార మేళా.. మహిళా అభ్యున్నతి వైపు ముందడుగు – 2023» ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాస్థాయిలో జరిగిన ఎస్‌హెచ్‌జీ ఎగ్జిబిషన్ మేళాలో వివిధ జిల్లాల నుంచి మహిళా సంఘాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. వాటి ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లు ప్రదర్శించాయి. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ మహిళలు తయారు చేస్తున్న నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు తక్కువ ధరకు అందించడం అభినందనీయమన్నారు. మహిళలు కొత్త రకాల ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. మహిళా ఉత్పత్తులను పరిశీలించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం అనంత్, డీపీఎం మనోహర్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


ఉత్పత్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

జగిత్యాలటౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్‌కు కొమ్ముకాస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూలీ పనులు చేసుకొని కడుపు నింపుకునే వారి పొట్ట కొట్టేలా కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీకి బడ్జెట్‌లో నిధులు కోత విధించడం దుర్మార్గమన్నారు. అదాని షేర్ల విలువ పడిపోవడంతో బ్యాంకులకు పెద్దమొత్తంలో రుణాలు ఎగవేసే అవకాశం ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో చాలామంది పేదలకు ఇళ్లస్థలాలు లేవని, అలాంటి వారికి స్థలాలు కేటాయించడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు సాయం చేయాలని కోరారు. పేదలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై సీఎం కేసీఆర్ దృష్టి సారించాలని అన్నారు. సమావేశంలో నాయకులు ఎండీ ముక్రం, వెన్న సురేశ్ పాల్గొన్నారు.

రాజలింగం సేవలు మరువలేనివి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): కామ్రేడ్ మార్గం రాజలింగం పార్టీ కోసం చేసిన సేవలు మరిచిపోలేనివని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో ఏడాది క్రితం మృతి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు మార్గం రాజలింగం కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు. రాజలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ సీనియర్ నాయకులు చెన్న విశ్వనాథం, జిల్లా కార్యదర్శి వెన్నం సురేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ ఉస్మన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరెడ్డి

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్‌కు చెందిన రైతు గడ్డం జలపతిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి జలపతిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. భూసేకరణలో భూమి కోల్పోయిన జలపతిరెడ్డి ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం అందకపోవడంతో తన ఇద్దరు కూతుళ్లను బావిలో తోసి తాను ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిలిండర్ పేలి గ్రానైట్ వ్యాపారి మృతి

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని ఖాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్ఎంఎస్ ర్యాక్ కట్టింగ్ పాలీషింగ్ ఫ్యాక్టరీలో సోమవారం ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ పేలి గ్రానైట్ వ్యాపారి మృతిచెందాడు. పేలుడు ధాటికి ఇంటి గోడలు, సామగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎస్సై ఎల్లయ్యగౌడ్ వివరాలు.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన వ్యాపారి రాంలాల్ చౌదరి(68) ఖాజీపూర్ శివారులో ఎస్ఎంఎస్ ర్యాక్ కట్టింగ్ పాలీషింగ్ కంపెనీ ఏర్పాటు చేసుకున్నాడు. పరిశ్రమ ఆవరణలో భవనం నిర్మించుకొని మొదటి అంతస్తులో నివాసముంటున్నాడు. ప్రతీ శనివారం సికింద్రాబాద్‌లో ఉంటున్న భార్య, పిల్లల వద్దకు వెళ్లి తిరిగి సోమవారం వస్తుంటాడు. అదేక్రమంలో సోమవారం ఖాజీపూర్‌కు చేరుకొని ఇంటి తాళం తీసి కరెంట్ స్విచ్ ఆన్ చేయగా పెద్ద శబ్దంతో సిలిండర్ పేలింది. అప్పటికే సిలిండర్ లీకై గది అంతా గ్యాస్‌తో నిండుకోవడాన్ని పసిగట్టని రాంలాల్ పేలుడు దాటికి 300 మీటర్ల దూరంలో పడగా కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడి బావమరిది కైలాస్ చంద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేలిందా..? పేల్చారా?

సిలిండర్ పేలిన ఘటనపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాంలాల్ ఇంట్లోకి వెళ్లిన కొద్ది నిమిషాల్లోనే పేలుడు సంభవించింది. గ్యాస్‌స్టవ్ పైప్‌లైన్ కోసినట్టుగానే ఉందని చర్చించుకుంటున్నారు. అదే సమయంలో కరెంటు సాకెట్‌లో ఒక పెన్ను పెట్టిన తీరు అనుమానాస్పదంగా ఉంది. బోర్డులో పెన్ను ఎవరుపెట్టారు? ఎందుకుపెట్టారు? అన్న చర్చ సైతం వినబడుతోంది. ఎవరైనా పేలుడుకు పథకం రచించారా? లేక ప్రమాదవశాత్తు జరిగిందా? అన్న విషయాలపై దర్యాప్తులో స్పష్టత రానుంది.

బైక్ అదుపుతప్పి యువకుడు..

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండల కేంద్రంలో సోమవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి కుందేళ్ల సాయిప్రకాశ్ అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామానికి చెందిన కుందేళ్ల సాయి ప్రకాశ్ గుల్లకోటకు చెందిన తన బావ స్వామి ఇటీవల ముంబాయి నుంచి రావడంతో పలకరించేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రాత్రి సమయంలో గుల్లకోట నుంచి ఖిలావనపర్తికి తిరిగి వస్తుండగా ఎండపల్లి శివారులోని 30–3 నంబర్ కల్వర్టు వద్ద బైక్ అదుపుతప్పి క్రింద పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్య

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సోమవారం వేర్వేరు కారణాలతో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. సిరిసిల్లలో చదువుకోవాలని మందలించినందుకు విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా.. కోరుట్ల మండలం నాగులపేటలో కాలు నొప్పి భరించలేక, జమ్మికుంటలో పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపంతో విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.

సిరిసిల్లక్రైం: బలాదూర్ తిరగొద్దని.. చదువుకోవాలని సూచించినందుకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. సంతానం లేరని దత్తత తీసుకుని పెంచుకుంటున్న కొడుకు ఇలా అర్ధంతరంగా ఆత్మహత్య చేసుకోవడంతో ఆ అమ్మ ఒంటరి అయ్యింది. సిరిసిల్లలోని బీవైనగర్‌కు చెందిన సద్గుణ–దేవేందర్‌కు సంతానం లేరు. చాలా ఏళ్ల క్రితం భాస్కర్‌ను దత్తత తీసుకున్నారు. కొడుకును ఉన్నత చదువులు చదివించాలని సిరిసిల్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. కరోనా కాలంలో తండ్రి దేవేందర్ అనారోగ్యంతో మృతిచెందాడు. భాస్కర్ చదువు బాధ్యతలు తల్లిపై పడ్డాయి. తండ్రి లేడని కొడుకును కాస్త గారాబం చేస్తే.. భాస్కర్ బలాదూర్‌గా తిరిగాడు. ఇంటి పరిస్థితిని వివరిస్తూ 9వ తరగతి చదువుతున్న కొడుకుకు బుద్ధి చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన భాస్కర్(17) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

నాగులపేటలో ఇంటర్ విద్యార్థిని..

కోరుట్లరూరల్: కోరుట్ల మండలం నాగులపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని కడప వైష్ణవి (17) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైష్ణవి మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న ఆమెకు ఇటీవల కాలు బెనకడంతో ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. అయితే కాలు నొప్పి భరించలేక, మనస్తాపం చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబసభ్యులు వచ్చి గమనించేలోపే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తన కూతురు కాలునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని తండ్రి దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


కడప వైష్ణవి(ఫైల్)

జమ్మికుంటలో పదోతరగతి విద్యార్థిని..

జమ్మికుంట(హుజూరాబాద్): పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపంతో ఓ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాలు.. జమ్మికుంట పట్టణంలోని అరెల్లి శ్రీనివాస్–అరుణ దంపతులు పిండిగిర్నీ నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరి కూతురు జాగృతి(15) పట్టణంలో ఓ ప్రైవేటు స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఇటీవల ప్రీ ఫైనల్ పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయి. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు రాత్రి 10 గంటల తర్వాత పని ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కూతురు మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది. టౌన్ సీఐ రామచందర్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు, దేశిని కోటి, శ్రీపతి నరేష్, దయ్యాల శ్రీనివాస్ సంతాపం తెలిపారు.


జాగృతి (ఫైల్)

ఎమ్మెల్సీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జగిత్యాలటౌన్: సామాన్యులపై ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని ప్రభుత్వంపై పోరాటం చేసి రద్దు చేయించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. మత్స్యకార విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్, పీసీసీ మెంబర్ గిరి నాగభూషణం, మత్స్యకార విభాగం జిల్లా అధ్యక్షుడు తోపారపు రజినీకాంత్ మాట్లాడుతూ అదనపు వినియోగ డిపాజిట్ పేరిట వసూలు చేయతలపెట్టిన ఏసీడీ చార్జీల రద్దు కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నాలు చేశామని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బింగి రవి, పల్లికొండ రాజు, రాజేందర్, తిరుపతి, గంగాధర్, నాగరాజు, శ్రీహరి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం.. రథోత్సవం.. పార్వేట్

- జిల్లాలో ఆధ్యాత్మిక శోభ
- పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రాయికల్‌లో భీమన్న కల్యాణోత్సవం, తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం, రత్నాపూర్‌లో మల్లన్న పల్లకీసేవ, బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పార్వేట్ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రాయికల్: భీమన్న ఆలయంలో కల్యాణం


అడవిలో పులిని వేటాడే దృశ్యాన్ని వివరిస్తున్న అర్చకులు


తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానవీధుల గుండా సాగిన రథోత్సవంలో భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. సర్పంచ్ గడీల గంగప్రసాద్, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, వీడీసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రత్నాపూర్‌లో మల్లన్న రథోత్సవం

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్‌లో నిర్వహిస్తున్న శ్రీమల్లికార్జునస్వామి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం మల్లికార్జునస్వామికి అభిషేకంతో పాటు పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో నిలువెత్తు బంగారం(బెల్లం)ను ముడుపుగా చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో సర్పంచ్ మేడి అనూష, ఎంపీటీసీ ముత్తమ్మ, ఉప సర్పంచ్ గోల్కొండ లయ, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, సీఏసీఎస్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్‌లో పార్వేట్ ఉత్సవం

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పార్వేట్ ఉత్సవం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని పల్లకిపై మంగళవాయిద్యాల మధ్య అడవికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అడవిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారో కథను భక్తులకు అర్చకులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమేశ్, జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రావు, ఈవో సంకుటాల శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు పెద్దసంతోశ్, చిన్న సంతోశ్, మధుకుమారాచార్యులు, ఆలయ మాజీ చైర్మన్లు సుమన్‌గౌడ్, కేశవులు భక్తులు పాల్గొన్నారు.

రాయికల్‌లో భీమన్న కల్యాణం

రాయికల్: రాయికల్‌లోని భీమన్న ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి అర్చకులు రమేశ్‌శర్మ ఆధ్వర్యంలో భీమన్న కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు దేవుని నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు. కాగా మంగళవారం భీమన్న రథోత్సవం నిర్వహించనున్నట్లు యూత్ సంఘ నాయకులు భూమేశ్ తెలిపారు.


మొక్కులు సమర్పిస్తున్న భక్తులు


రత్నాపూర్‌లో శ్రీమల్లికార్జున స్వామి రథోత్సవం